# ప్రభాత సూర్యుడు

తెలుగు దినపత్రిక

RANGAREDDY, EDITION : 01, VOLUME : 72 EDITOR:CHERUKU UPENDAR, DATE : WEDNESDAY 12 JULY 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 72 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : బుధవారం 12 జూలై 2023 పేజీలు : 4 వెల : 5/-


## సుప్రీంకోర్టుకు
# అమరావతి రాజధాని కేసు

**విచారణ జరపనున్న ద్విసభ్య కమిటీ..**

న్యూఢిల్లీ- ప్రభాత సూర్యుడు




ఏపీ రాజధాని అంశం మరోసారి హాట్ టాపిక్ గా మారింది. మళ్లీ రాజకీయ రచ్చ మొదలైంది. సుప్రీంకోర్టులో రాజధాని అమరావతి కేసు విచారణకు రానుంది. ద్విస్వభ్య కమిటీ ధర్మాసనం

మిగతా 2లో...

# గులాబీ జెండా... ఎదురీదుతోంది..!




● గుబులు పుట్టిస్తున్న బీఆర్ఎస్ సర్వే ● గ్రాఫ్ పడిపోవడానికి సిట్టింగ్ ఎమ్మెల్యేల వ్యవహారశైలే కారణం ● బీఆర్ఎస్ నేతలు ఉక్కిరిబిక్కిరవుతున్న

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

అధికార బీఆర్ఎస్ పార్టీ ఈసారి రాష్ట్రంలో ఏటికి ఎదురీదుతున్నది. గత ఎన్నికల తరహాలో నల్లేరు మీద నడకలా లేదు. రాజకీయ పార్టీలకు అతీతంగా జరుగుతున్న సర్వేలో బీఆర్ఎస్ గ్రాఫ్ పడిపోవడానికి సిట్టింగ్ ఎమ్మెల్యేల వ్యవహారశైలే కారణమని వెల్లడైంది. ప్రభుత్వ పథకాలపైనా పెద్దగా వ్యతిరేకత లేకపోయినా ఎమ్మెల్యేలతో పాటు స్థానిక పార్టీ లీడర్ల ఓవరాక్షన్‌పై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో వారిదే పెత్తనమవుతున్నదని, అధికార పార్టీ నేతలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే అభిప్రాయం సర్వేలో తేలింది. రేషన్ కార్డులు, ఆసరా పింఛన్లు మొదలు కల్యాణలక్ష్మి, దళితబంధు తదితర పథకాలకూ ఎమ్మెల్యేల మాటే ఫైనల్ అవుతున్నదని, వారి దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉందని వాపోయారు. వారి సహాయకులు, అనుచరులు, స్థానిక నేతలు అజమాయిషీతోపాటు

మిగతా 2లో...

# కేబినెట్ మార్పులు

## ఢిల్లీలో మారుతున్న పరిణామాలు !



న్యూఢిల్లీ- ప్రభాత సూర్యుడు


ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఫ్రాన్స్ పర్యటన కంటే ముందే మంత్రి వర్గాన్ని పునర్ వ్యవస్థీకరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే కేబినెట్ మార్పు చేర్పులపై ప్రధాని మోదీ పూర్తి స్థాయి కసరత్తు చేశారని చెబుతున్నారు. తెలంగాణ, రాజస్థాన్‌లకు కేంద్ర మంత్రులను చీఫ్‌లుగా ప్రకటించారు . అలాగే కొంత మంది సీనియర్లను పార్టీ పనుల కోసం రాజీనామా చేయించనున్నారు. ఈ క్రమంలో గత వారం నుండి దేశ వ్యాప్తంగా కేంద్ర కాబినెట్ లో కీలక మార్పులు జరుగుతాయని వార్తలు వస్తూనే ఉన్నాయి. ఇప్పుడు సమయం దగ్గర పడిందని.. ఒకటి రెండు రోజుల్లో

మిగతా 2లో...

# ఉత్తరాది రాష్ట్రాల్లో వరుణుడు బీభత్సం

**40 మంది మృతి.. రూ.3,000 కోట్ల మేర నష్టం**

హిమాచల్‌ప్రదేశ్- ప్రభాత సూర్యుడు



ఉత్తరాది రాష్ట్రాల్లో వరుణుడు బీభత్సం సృష్టిస్తున్నాడు. ఢిల్లీ సహా హర్యానా, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్ముకశ్మీర్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌లో కుండపోతగా వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా హిమాచల్ ప్రదేశ్ భారీ వర్షాలకు అతలా కుతలమైంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న కుంభవృష్టికి ఆస్తి, ప్రాణ నష్టం సంభవించింది. గత మూడు రోజులుగా కురుస్తున్న వానల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 30 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ రాష్ట్ర రాజధాని సిమ్లా లో అత్యధికంగా 11 మంది మరణించారు. మృతి చెందిన 30 మందిలో ఇప్పటి వరకు 29 మందిని గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. మరోవైపు భారీ వర్షం కారణంగా సంభవించిన వరదలకు సుమారు రూ.3,000 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. వర్షాల కారణంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడుతున్నాయి. దీంతో చందర్తాల్, పాగల్ నల్లా, లాహౌల్, స్పితి సహా పలు ప్రాంతాల్లో సుమారు 500 మంది పర్యాటకులు చిక్కుకుపోయారు. ఇక ఉనా జిల్లాలోని మురికివాడను వరదలు ముంచెత్తాయి. అందులో చిక్కుకుపోయిన 515

మిగతా 2లో...

# ఆ ముగ్గరు పార్టీ మారుతున్నారా...



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

అంతర్గత పోరు తెలంగాణ బీజేపీని కలవరపాటుకు గురి చేస్తున్నది. నేతల మధ్య సమన్వయ లోపం పార్టీకే ప్రమాదం అని భావించిన అధిష్టానం ఇటీవలే సంస్థాగత మార్పులకు శ్రీకారం చుట్టింది. రాష్ట్ర అధ్యక్షుడిగా కిషన్ రెడ్డి, ఎలక్షన్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా ఈటల రాజేందర్, పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని నియమించిన హైకమాండ్ పార్టీలో ఏర్పడిన సంక్షోభానికి ఎండ్ కార్డు వేయాలని కసరత్తు చేసింది. ఈ క్రమంలో మోడీ పర్యటనతో

మిగతా 3లో...

24

# 20న కాంగ్రెస్లోకి జూపల్లి

**- కొల్లాపూర్ సభకు హాజరు కానున్న ప్రియాంకా గాంధీ**

మహబూబ్ నగర్- ప్రభాత సూర్యుడు



మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు 20వ తేదీన కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. కొల్లాపూర్ లో భారీ బహిరంగసభ ఏర్పాటు చేశారు. ఈ సభకు ప్రియాంకా గాంధీ హాజరు కానున్నారు. ఈ సభలో జూపల్లి తోపాటు ఎమ్మెల్సీ కూచుకుల్లా దామోదర్ రెడ్డి తోపాటు మరికొందరు పార్టీలో చేరనున్నారు . కొల్లాపూర్ సభ ఖమ్మం సభకంటే విజయవంతం అవుతుందని కాంగ్రెస్ నేతలు

మిగతా 2లో...

## విద్యారంగ సమస్యల పరిష్కారానికి
# 12న విద్యా సంస్థల బంద్



జగిత్యాల- ప్రభాత సూర్యుడు

రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ బీసీ సంక్షేమ సంఘం మరియు వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 12న రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు మరియు ఇంటర్ కళాశాలల బంద్ కు పిలుపు నిచ్చినట్లు గా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ తెలిపారు. విద్యా రంగంలో నెలకొని ఉన్న అనేక సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వం విద్యా రంగంపై అవలంబిస్తున్న నిర్లక్ష్య ధోరణికి నిరసనగా రేపు జులై -12 న రాష్ట్ర వ్యాప్త పాఠశాలలు మరియు ఇంటర్మీడియట్ కళాశాల తరగతుల బహిష్కరణకు పిలుపునివ్వడం జరిగిందని ఆయన అన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమై రెండు నెలల గడుస్తున్నా విద్యా రంగంపై ప్రభుత్వం

మిగతా 2లో...

# సేఫ్ ప్లేస్ వెతుక్కుంటున్న సీఎం అభ్యర్థులు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు




షెడ్యూల్ ప్రకారం జరిగే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా ఏడాదిన్నర సమయం ఉన్నది. కానీ అన్ని పార్టీలూ ఇప్పటినుంచే కసరత్తు మొదలుపెట్టాయి. ఏయే స్థానాల నుంచి పోటీ చేయాలో ముఖ్యమంత్రి రేసులో ఉన్న వివిధ పార్టీల అభ్యర్థులు డిసైడ్ చేసుకుంటున్నారు. దీర్ఘకాలంగా ఓటర్లు ఆదరించిన నియోజకవర్గాలను కాదని కొత్తవాటిని ఎంచుకోవడంపై దృష్టి సారించారు. పాత ఓటర్లు ఎలా ఆదరిస్తారోననే అనుమానమా? ఎక్కడి నుంచి పోటీ చేసినా గెలుస్తామనే ధీమానా? సేఫ్ జోన్‌గా ఉంటాయనే భరోసానా? మునుపెన్నటికంటే రాజకీయ వాతావరణం తీవ్రంగా ఉండడమా?.. కారణాలేవైనా.. ముఖ్యమంత్రి రేసులో ఉన్న సీనియర్ నేతలంతా ఈసారి కొత్త స్థానాల నుంచి పోటీ చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. కేసీఆర్‌కు కంచుకోటగా ఉన్న గజ్వేల్ అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి ఈసారి తప్పుకుని మరో చోటి నుంచి పోటీ చేయాలనుకుంటున్నట్లు ఆ పార్టీ వర్గాలే చెప్తున్నాయి. సిద్దిపేట లేదా ఆలేరు నుంచి పోటీ చేయవచ్చునే ఊహాగానాలు వస్తున్నాయి. గజ్వేల్ నుంచి ఒంటేరు ప్రతాపరెడ్డి పోటీ చేయవచ్చని స్థానిక నేతల సమాచారం. మరోవైపు ఈటల రాజేందర్ సైతం రాజకీయాల్లోకి ఎంటర్ అయినప్పటి నుంచీ హుజూరాబాద్ స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇప్పుడు అక్కడి నుంచి గజ్వేల్‌కు షిఫ్ట్ కానున్నట్లు స్వయంగా ఆయనే చెప్పారు. హుజూరాబాద్ ఉప ఎన్నికలో అధికార పార్టీ ఎన్ని ప్రలోభాలు పెట్టినా,.. భారీ స్థాయిలో ఖర్చు చేసినా, అధికార యంత్రాంగాన్ని మోహరించినా సుమారు పాతిక వేల ఓట్ల మెజారిటీతో గెలిచిన ఉత్సాహంతో ఈసారి సీఎం కేసీఆర్‌తో .

మిగతా 2లో...

## త్వరలో
# 15 వేల టీచర్ పోస్టులు



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

త్వరలో టెట్ నోటిఫికేషన్ రాబోతుంది. ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు భర్తీ చేసేందుకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయించింది. తెలంగాణలో ఉద్యోగాల భర్తీ ప్రక్రియ నడుస్తోంది. అయితే డీఎస్సీపై ఇప్పటి వరకు మాత్రం ఎలాంటి అప్డేట్ లేదు. గతేడాది టెట్ పరీక్ష నిర్వహించిన విద్యాశాఖ... వెంటనే

మిగతా 2లో...

## సుప్రీంకోర్టుకు అమరావతి రాజధాని కేసు..

(మొదటి పేజీ తరువాయి)

విచారణ చేయనుంది. అమరావతి రాజధాని నగరం, ప్రాంతాన్ని నిర్మించి, అభివృద్ధి చేయాలని ఆదేశించిన హైకోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ను సుప్రీంకోర్టు మంగళవారం జూలై 11న విచారణ జరుగనుంది. ఆరు నెలల్లో అమరావతి నిర్మించాలన్న ఆంధ్రప్రదేశ్ హై కోర్ట్ ఆదేశాలపై గత విచారణలో సుప్రీంకోర్టు స్టే విధించిన సంగతి తెలిసిందే. అయితే, కేంద్ర ప్రభుత్వం, ప్రతివాదులకు కోర్టు నోటీసులు ఇచ్చింది. గతంలో విచారణ చేసిన న్యాయమూర్తి జస్టిస్ జోసెఫ్ పదవీ విరమణ కావడంతో కొత్త బెంచ్కి కేసు బదిలీ అయ్యింది. సుప్రీంకోర్టుకు మే 21 నుంచి జూలై 2 వరకు వేసవి సెలవులు ఉండడంతో పాటు జస్టిస్ జోసెఫ్ జూన్ 16, 2023న పదవీ విరమణ చేయనున్నందున తీర్పును రాయడానికి కోర్టుకు సమయం లేకుండా పోతుందని ధర్మాసనం పేర్కొంది. మూడు రాజధానుల ఏర్పాటు కోసం రూపొందించిన చట్టాన్ని ఉపసంహరించుకున్నామని, హైకోర్టు తీర్పు ప్రభావమే వాదించాల్సి ఉందని మాజీ అటార్నీ జనరల్, సీనియర్ న్యాయవాది కేకే వేణుగోపాల్ ధర్మాసనానికి తెలిపారు.

## కేబినెట్ మార్పులు

(మొదటి పేజీ తరువాయి)

ముహూర్తం ఉండబోతోందని చెబుతున్నారు. బీజేపీ హై కమాండ్ రెండు సార్లు అత్యున్నత మీటింగ్ నిర్వహించింది. అయినప్పటికి బీజేపీ ఈ కెబినెట్ మార్పులపై ఎటువంటి ప్రకటన చేయలేదు. అనూహ్యమైన మార్పులు చేయడానికి సిద్ధం కావడం వల్లనే ఆలస్యం అవుతోందని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. హై కమాండ్ నుండి వినిపిస్తున్న ప్రకారం మొత్తం 22 మంది కేంద్ర మంత్రులపై వేస్తూ వేయడానికి మోదీ ప్రభుత్వం సిద్ధమైంది. ఇక ఇటీవల కిషన్ రెడ్డిని తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా మార్చడం వలన ఆయనను ఎవరితో భర్తీ చేస్తారు ? తెలుగు రాష్ట్రాల నుండి ఎవరిని తీసుకుంటారు అన్నది ఆసక్తికరంగా మారింది.రెండు రోజుల క్రితం డిల్లీ వేదికగా కెబినెట్ మీటింగ్ జరిగిన విషయం తెలిసిందే. ఈ మీటింగ్ లో దేశవ్యాప్తంగా కొన్ని రాష్ట్రాలలో బీజేపీ బాధ్యతలను అప్పగించిన నాయకుల విషయంలో కీలక మార్పులు గురించి చర్చ జరిగింది. మంత్రివర్గంలో భారీగా మార్పులు జరగబోతున్నాయనే ఊహాగానాల నడుమ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ సోమవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్మ ను రాష్ట్రపతి భవన్లో కలిశారు. ఈ వారంలోనే మంత్రివర్గాన్ని పునర్వ్యవస్థీకరించబోతున్నట్లు వార్తలు వస్తున్న తరుణంలో వీరిద్దరి భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఇటీవల కొందరు మంత్రులతో సమావేశాలు జరిపిన సంగతి తెలిసిందే. నడ్డాతో నిర్మల కూడా సమావేశమయ్యారు. ఆమెను మంత్రి పదవి నుంచి తొలగిస్తారనే ప్రచారం జరుగుతోంది.ఈ నెల 20 నుంచి పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభం కాబోతున్నాయి. రానున్న లోక్సభ ఎన్నికల కోసం బీజేపీ కూడా సమాయత్తమవుతోంది. పాత మిత్రులను దగ్గరకు తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తోంది. 18న ఎన్డీయే సమావేశానికి హాజరుకావాలని వివిధ పార్టీలను ఆహ్వానించింది. మోదీ ఈ నెల 13, 14 తేదీల్లో ఫ్రాన్స్లో పర్యటిస్తారు. పారిస్లో ఈ నెల 14న జరిగే బాస్టిల్లే డే పెరేడ్లో గౌరవ అతిథిగా పాల్గొంటారు.

## త్వరలో 15 వేల టీచర్ పోస్టులు

(మొదటి పేజీ తరువాయి)

డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తుందని అంతా భావించారు. కానీ ఇప్పటి వరకు ప్రకటన జారీ కాలేదు. ఇప్పటికే టెట్ పరీక్ష నిర్వహించి... ఏడాది పూర్తి అయింది. ఈ నేపథ్యంలో మరోసారి టెట్ నోటిఫికేషన్ ఇస్తారా...? నేరుగా డీఎస్సీనే నిర్వహిస్తారా అన్న చర్చ జరుగుతుంది. ఈ క్రమంలో తెలంగాణ మంత్రివర్గ ఉప సంఘం కీలక నిర్ణయం తీసుకుందిరాష్ట్రంలో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు భర్తీ చేసేందుకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) నిర్వహించాలని మంత్రి వర్గ ఉప సంఘం నిర్ణయించింది. ఫలితంగా మరోసారి టెట్ కోసం ఎదురుచూస్తున్న వారికి తీపి కబురు చెప్పినట్లు అయింది. త్వరలోనే ఇందుకు సంబంధించిన ప్రకటన వచ్చే అవకాశం ఉంది.రాష్ట్ర ఏర్పాటు తర్వాత 2016 మే 22, 2017 జులై 23, 2022 జూన్ 12న టెట్ పరీక్షలు నిర్వహించారు. మరో నెలలో ఏడాది గడుస్తున్నందున మళ్లీ టెట్ జరపాల్సి ఉంటుంది. ఏడాది కాలంలో డీఈడీ, బీఈడీ ఉత్తీర్ణులైన వారు 20వేలకు పైగా ఉంటుంది. గత కొంతకాలంగా మరో టెట్ నిర్వహించిన తర్వాతే డీఎస్సీ పరీక్షను జరపాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈసారి నిర్వహించబోయే పరీక్షకు కూడా దాదాపు 3 లక్షల మందికిపైగా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలోనే మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం తీసుకుంది. డీఎడ్, బీఎడ్ పాసైన వారు టెట్లో ఉత్తీర్ణులైతేనే ఉపాధ్యాయుల నియామకానికి నిర్వహించే టీఆర్టీ పరీక్ష రాయడానికి అర్హులవుతారు. టెట్లో వచ్చిన మార్కులకు టీఆర్టీ ర్యాంకింగ్లో 20 శాతం వెయిటేజీ ఉన్నందున టెట్లో అత్యధిక మార్కులు దక్కించుకోవడానికి అభ్యర్థులు పోటీపడుతుంటారు. టెట్లో అర్హత లేకపోతే ఈ పరీక్షలకు హాజరుకాలేరు. రాష్ట్రంలో స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ పోస్టులు 13 వేల వరకు ఖాళీగా ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. దాదాపు 15 వేల వరకు టీచర్ ఉద్యోగాలకు సంబంధించి టీఆర్టీ నోటిఫికేషన్ రావొచ్చు. పలుమార్లు ప్రకటనలు వచ్చినప్పటికీ? నోటిఫికేషన్లు జారీ కాలేదు. నిరుద్యోగులు కూడా భారీ సంఖ్యలో టీఆర్టీ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారు.

# గులాబీ జెండా ఎదురీదుతోంది..!

(మొదటి పేజీ తరువాయి)

కిందిస్థాయి సిబ్బంది లంచాలిస్తేనే దరఖాస్తులను ఓకే చేస్తున్నారన్న ఆగ్రహాన్ని వెలిబుచ్చారు. దళితబంధు విషయంలో ఎమ్మెల్యేలు 30శాతం కమిషన్ తీసుకుంటున్నట్లు ఫిర్యాదులు వచ్చాయని ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన కామెంట్లు జనంలోకి విస్తృతంగా వెళ్లాయి.ఈ సర్వేలో వ్యక్తం చేసిన అభిప్రాయాలకు తగినట్లుగానే గతంలో చాలా మంది ఎమ్మెల్యేలను ప్రజలు అడ్డుకున్నారు. మేడ్చల్లో మంత్రి మల్లారెడ్డి, డోర్నకల్లో రెడ్యానాయక్, భువనగిరిలో పైళ్ల శేఖర్రెడ్డి, అచ్చంపేటలో గువ్వల బాలరాజు, మహబూబాబాద్లో శంకర్ నాయక్, అశ్వారావుపేటలో మెచ్చా నాగేశ్వరరావు, ఆందోల్లో క్రాంతికిరణ్, జనగాంలో ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, ఆలంపూర్లో అబ్రహం, హుజూరాబాద్లో ఎమ్మెల్సీ కౌశిక్రెడ్డి, ఆలేరులో గొంగిడి సునీత, పరిగిలో మహేశ్వర్రెడ్డి, కొత్తగూడెంలో వనమా వెంకటేశ్వరరావు, చొప్పదండిలో రసమయి బాలకిషన్, వరంగల్ ఈస్ట్ ఎమ్మెల్యే నరేందర్లను ప్రజలు అడ్డుకున్నారు.

ప్రజలను పట్టించుకోకుండా వారి సొంత అవసరాలకే ఎక్కువ ప్రయారిటీ ఇస్తున్నారన్న భావన ప్రజల్లో ఉంది. మంత్రి సబితా ఇంద్రారెడ్డికి కూడా సొంత నియోజకవర్గంలో ఇదే తరహా చేదు అనుభవం ఎదురైంది. కొత్తగూడెంలో ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు కుమారుడు రాఘవ వేధింపులతో ఒక ఫ్యామిలీ సూసైడ్ చేసుకోవడం తదితరాలన్నీ అధికార పార్టీ ఆగడాల కోవలోకి చెందినవి.సిట్టింగ్లందరికీ ఈసారి టికెట్లు ఇస్తామని పార్టీ అధినేత కేసీఆర్ చేసిన ప్రకటనపై గ్రామీణ ప్రజానీకం ఉడికిపోతున్నారు. ఇప్పటికే వారి చర్యలు శృతిమించిపోయాయని, మరోసారి ఎమ్మెల్యే అయితే వారికి హద్దూ అదుపు ఉండదన్న అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

మరోసారి వారికి ఓటు వేసే ప్రసక్తే లేదని సర్వే సందర్భంగా ముఖంమీదనే చెప్పారని అధ్యయనంలో పాల్గొన్నవారి ద్వారా తెలిసింది. ఏ అవసరానికైనా గతంలో అధికారుల దగ్గరికి వెళ్లేవారమని, ఇప్పుడు అక్కడ దరఖాస్తు ఇచ్చినా ఎమ్మెల్యే చెప్పిన తర్వాతనే ఫైనల్ అవుతున్నదనే స్వీయానుభవాలను వివరించారు. సమస్యలను చెప్పుకునే మార్గం కూడా లేకుండాపోయిందని, ఎమ్మెల్యేలకంటే వారి చుట్టూ తిరిగే కోటరీయే చక్రం తిప్పుతున్నారని పేర్కొన్నారు.ఒకవైపు కాంగ్రెస్ గ్రాఫ్ పెరుగుతున్నదని, కర్ణాటక రిజల్ట్ తర్వాత రాష్ట్రంలో ప్రజల ఆలోచనా సరళిలో మార్పు వచ్చిందని బీఆర్ఎస్ నేతలు ఉక్కిరిబిక్కిరవుతున్న టైమ్లో ఢిల్లీకి చెందిన సర్వే సంస్థలో విస్తుపోయే అంశాలు వెల్లడి కావడం గమనార్హం. పూర్తిస్థాయి నివేదికలో ఇంకా ఎలాంటి వివరాలు వస్తాయో, అది పార్టీకే ఎలాంటి చిక్కులు తెస్తుందోననే కలవరం మొదలైంది. ఎమ్మెల్యేలు వారి పనితీరును మార్చుకోవాలంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ పలుమార్లు పార్టీ సమావేశాల్లో హెచ్చరించారు. ఇకనైనా పద్ధతి మార్చుకోవాలని, లేదంటే టికెట్లు ఇచ్చేదిలేదనే మెసేజ్ పంపారు. ఇదే సమయంలో సర్వేలో సైతం సిట్టింగ్లపై ప్రజలు తీవ్రమైన వ్యతిరేకతను వ్యక్తం చేయడం గమనార్హం.

## ఉత్తరాది రాష్ట్రాల్లో వరుణుడు బీభత్సం

(మొదటి పేజీ తరువాయి)

మంది కార్మికులను నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ సురక్షితంగా రక్షించారు.మరోవైపు రాష్ట్రంలోని తాజా పరిస్థితుల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని హిమాచల్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖ్ ప్రజలకు సూచించారు. ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్, నీటి సరఫరాను పునరుద్ధరించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. వరదల కారణంగా చిక్కుకుపోయిన పర్యాటకులు సురక్షితంగా ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో పరిస్థితి అదుపులోనే ఉందని.. ప్రతి జిల్లాలోనూ మంత్రులు ఉంటూ అక్కడి పరిస్థితిని పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం వరద ప్రభావిత ప్రాంతాల్లో సమాయక చర్యలు కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు.'రాష్ట్రంలో ఇప్పటి వరకు రోడ్డు ప్రమాదాలు వంటి కారణాల వల్ల 20 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. కొండచరియలు విరిగిపడటం, ఆకస్మిక వరదల కారణంగా ప్రాణనష్టం అంత ఎక్కువగా లేదు.రహదారులు, లింక్ రోడ్లతో సహా 1,300 రోడ్లు దెబ్బతిన్నాయి. రాబోయే రెండు రోజులు అలర్ట్ గా ఉండాలి' అని రాష్ట్ర రెవెన్యూ మంత్రి జగత్ సింగ్ నేగి అన్నారు.

**టూరిస్ట్ హాట్స్పాట్లో కొట్టుకుని పోయిన కార్లు**

నైఋతి రుతుపవనాల ప్రభావంతో భారీ వర్షాల దాటికి ఉత్తరాది రాష్ట్రాలు వణికిపోతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీ, హిమాచల్ప్రదేశ్, జమ్మూ కశ్మీర్, పంజాబ్, హరియాణా, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో నదులు, వాగులు పొంగిపొర్లుతున్నాయి. ప్రకృతి ప్రకోపంతో హిమాచల్ప్రదేశ్ తల్లడిల్లిపోతోంది. తాజాగా హిమాచల్ ప్రదేశ్ లోని వరద ఉధృతికి కొట్టుకుని పోయిన కార్ల వీడియో ఒకటి సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. రాష్ట్రంలోని సోలన్ జిల్లాలోని పర్వానూ అనే పర్యాటక ప్రదేశంలో జరిగినట్లు తెలుస్తోంది. సమీపంలోని బాల్కనీలపై ఉన్న వ్యక్తులు కేకలు వేస్తూ ఆ నీటిలో కొట్టుకుని పోతున్న కార్లను తమ మొబైల్లో బంధిస్తున్నట్లు వీడియో చూపించింది. గత కొన్ని గంటల పాటు కురిసిన భారీతో వర్షం వీధులన్నీ జలమయం అయ్యాయి. వరద ఉధృతికి వంతెనలు కొట్టుకుపోతున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి.. అంతేకాదు రానున్న రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రజలు అందరూ ఇళ్లలోనే ఉండమని ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. చండీగఢ్-మనాలి జాతీయ రహదారిపై కొండచరియలు విరిగిపడటం, వరదల కారణంగా పలు చోట్ల రహదారులు మూసుకుపోయింది. సిమ్లా-కిన్నౌర్ రహదారి కూడా స్లైడ్లు, రాళ్లు పడిపోవడం వల్ల వాహనాల రాకపోకలకు మూసివేశారు. ఆకస్మిక వరదలకు కొన్ని జిల్లాల్లో రోడ్లు కొట్టుకుపోయాయి. వంతెనలు ధ్వంసమయ్యాయి. భారీ వర్షాలు, వరదలతో ఏర్పడిన నష్టాన్ని అంచనా వేస్తున్నామని.. రూ. 3,000-4000 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు.

## విద్యారంగ సమస్యల పరిష్కారానికి 12న విద్యా సంస్థల బంద్

(మొదటి పేజీ తరువాయి)

నిర్దిష్టమైన చర్యలు తీసుకోవడం లేదని త్రాగునీరు, మధ్యాహ్న భోజనం బిల్లుల పెండింగ్, మూత్రశాలల వంటి కనీస మౌళిక సదుపాయాలు లేక ప్రభుత్వ విద్యారంగం విద్యార్థి లోకం తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. మన ఊరు-మనబస్తీ, మనబడి పనులు తూతూమంత్రంగా చేసి చేతులు దులుపు కుంటున్నారని, ఈ పథకం ద్వారా ఎక్కడ సరిగ్గా పాఠశాలలకు ఉపయోగం లేదని ఆయన అన్నారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం హామీగా నే మిగిలిందని, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇప్పటి వరకు అందలేదని, అధ్యాపకుల కొరత కూడా తీవ్రంగా ఉందని అన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చింతల గంగాధర్ మాట్లాడుతూ రాష్ట్రంలో గత నాలుగేళ్ల నుండి ఫీజు రీయంబార్స్మెంట్, స్కాలర్ షిప్స్ 5,177 కోట్లు పెండింగులో ఉన్నాయని, గురుకులాలు కేజీబివిలు ఇంటర్ కళాశాల లుగా అఫ్ గ్రేడ్ చేసిన కేజీబివి లకు స్వంత భవనాలు లేక అరాకొర సౌకర్యాలతో అద్దె భవనాల్లో నడుస్తున్నాయని. భోజనంలో నాణ్యత లేక విద్యార్థులు అస్వస్థతకు గురౌతున్న ఘటనలు ఎన్నో ఉన్నాయని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న టీచర్, లెక్చరర్స్ పోస్టు భర్తీ చేయాల్సి ఉందని ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో విద్యారంగ సమస్యలకు కేంద్రంగా చెప్పుకోవచ్చు అని ఆయన ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా అపరిష్కృతంగా పేరుకుపోయిన సమస్యలను పరిష్కారం చేయాలనే ప్రధాన డిమాండ్ తో రేపు రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సంస్థల బంద్ నిర్వహిస్తున్నామని ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యలు పరిష్కారం చేయాలని ఆయన అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలో బంద్ విజయవంతం చేయాలని విద్యార్థి లోకానికి బీసీ విద్యార్థి సంఘం, యువజన సంఘం, సంక్షేమ సంఘం సంయుక్తంగా పిలుపు నిచ్చాయి. ఈ సందర్భంగా ముసిపట్ల లక్ష్మీనారాయణ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, చింతల గంగాధర్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, అలిశెట్టి ఈశ్వరయ్య బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యనిర్వాహక కార్యదర్శి, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు కొక్కు గంగాధర్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు జాజుల రమేష్, బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు తిరుపురం రాంచందర్, అక్రమ మాలిక్ ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి, మేకల సంజయ్ ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు, మనీషా ఎస్ఎఫ్ఐ జిల్లా బాలికల కన్వీనర్, బచ్చల వినోద్ ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు, ఎన్జీవో రమేష్ సిపిఎం నాయకులు తదితర బీసీ నాయకులు పాల్గొన్నారు.

## 20న కాంగ్రెస్లోకి జూపల్లి

(మొదటి పేజీ తరువాయి)

ధీమా వ్యక్తం చేస్తున్నారు. బిజెపి లో లుకలుకలున్నాయి .. కాషాయం పార్టీలో చాలామంది నేతల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయన్నారు. బిఆర్ఎస్ ను ఎదుర్కొనే పార్టీ కాంగ్రెస్ ఒక్కటేనని.. ఎన్ని మాయమాటలు చెప్పిన బిఆర్ఎస్, బీజేపీలను నమ్మరని మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. 100 సీట్లతో రాష్ట్రంలో 300 సీట్లతో కేంద్రంలో కాంగ్రెస్ సర్కార్ లు ఏర్పడనున్నాయి. ప్రజా ప్రభుత్వం కావాలంటే కాంగ్రెస్ పార్టీకి ఓటెయ్యాలని పిలుపునిచ్చారు. కొల్లాపూర్ సభా ఏర్పాట్లపై చర్చించేందుకు సోమవారం భట్టి విక్రమార్క నివాసానికి జూపల్లి కృష్ణారావు వచ్చారు. పాదయాత్ర విజయవంతపై భట్టికి జూపల్లి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జూపల్లి మీడియాతో మాట్లాడుతూ... కొల్లాపూర్లో జరగబోయే బహిరంగ సభకు రావాలని భట్టిని కోరినట్లు తెలిపారు. ప్రజా సమస్యలపై అనేక విషయాలు యాత్రలో తెలుసుకున్నట్లు భట్టి చెప్పారన్నారు.మహబూబ్ నగర్ జిల్లా నేతలంతా కలిసి మాట్లాడుకున్నామని..పారు. సభకు జాతీయ నేతలు రాబోతున్నారని.. సభను సక్సెస్ చెయ్యాలని చూస్తున్నామన్నారు. అన్ని నియోజకవర్గాల నుంచి నేతల చేరికలు ఉంటాయన్నారు. కూచుకుల్లా దామోదర్ రెడ్డి ఆయన కుమారుడు, మేఘా రెడ్డితో పాటు చాలామంది నేతలు కాంగ్రెస్లో చేరనున్నట్లు జూపల్లి కృష్ణారావు వెల్లడించారు.జూపల్లి కాంగ్రెస్లో చేరుతున్నందుకు ధన్యవాదాలు అని భట్టి అన్నారు. జూపల్లి చేరిక పార్టీకి, రాష్ట్రానికి ఉపయోగపడుతుందన్నారు. చేరిక సమయంలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నామని.. సభ ద్వారా తెలంగాణ సమాజానికి ఓ మెసేజ్ వెళ్లనుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నేతలు క్యాడర్ కదిలిరావాలని పిలుపునిచ్చారు.జూపల్లి కృష్ణారావు మొదట కాంగ్రెస్ లోనే ఉండేవారు. తెలంగాణ ఉద్యమ సమయంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మంత్రి కూడా అయ్యారు. 2018 ఎన్నికల్లో ఆయన కాంగ్రెస్ అభ్యర్థి బీరం హర్షవర్ధన్ రెడ్డి చేతిలో ఓడిపోయారు. ఆ తర్వాత ఆయన బీఆర్ఎస్ లో చేరడంతో ... జూపల్లి కృష్ణరావుకు ప్రాధాన్యం తగ్గిపోయింది. వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ కూడా ఇచ్చే అవకాశం లేకపోవడతో ఆయన కాంగ్రెస్ లో చేరాలని నిర్ణయించుకున్నారు.

## సేఫ్ ప్లేస్ వెతుక్కుంటున్న సీఎం అభ్యర్థులు

(మొదటి పేజీ తరువాయి)

తలపడాలనుకుంటున్నారు.ఇదిలా ఉండగా.. కరీంనగర్ ఎంపీగా ఉన్న బీజేపీ స్టేట్ చీఫ్ బండి సంజయ్ ఈసారి వేములవాడ అసెంబ్లీ నుంచి బరిలోకి దిగనున్నట్లు ఆయన సన్నిహితులే చెప్తున్నారు. రాష్ట్రంలో అధికారంలోకి రావాలన్న లక్ష్యంతో ఉన్నందున ఈసారి పార్లమెంటుకు బదులుగా అసెంబ్లీకే వెళ్ళడానికి డిసైడ్ అయ్యారు. ముఖ్యమంత్రి అభ్యర్థి అని పార్టీ హైకమాండ్ ప్రకటించకపోయినా.. ఆ రేసులో ఫ్రంట్ రన్నర్గా ఉన్నారు. ప్రస్తుతం వేములవాడ స్థానం అధికార పార్టీ చేతిలో ఉన్నా.. సిట్టింగ్ ఎమ్మెల్యే పౌరసత్వ వివాదంలో చిక్కుకున్నారు. ఈసారి ఆయనకు టికెట్ అనుమానమే. చాలాకాలంగా వేములవాడపై ఫోకస్ పెట్టిన బండి సంజయ్ గెలవడం ఖాయమనే ధీమాలో ఉన్నారు. ఇప్పటి నుంచే అక్కడ గ్రౌండ్ వర్కు మీద దృష్టి పెట్టారు. ఈసారి కాంగ్రెస్కు 90 స్థానాలు ఖాయమంటూ తెలంగాణ పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి గట్టి ధీమాతోనే ఉన్నారు. పీసీసీ చీఫ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఒకింత ఉత్సాహంగా ఉన్నారు. పార్టీ పట్ల ప్రజల్లో నమ్మకం పెరిగిందని, శ్రేణులకు ధైర్యం వచ్చిందని రేవంత్ సహా సీనియర్ నేతల బలమైన అభిప్రాయం. ప్రస్తుతం మల్కాజిగిరి ఎంపీగా ఉన్నా అంతకుముందు కొడంగల్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఈసారి అక్కడి నుంచి పోటీచేయాలనే ఆలోచన ఉన్నా .. ఎల్బీ నగర్కు షిఫ్ట్ కావడంపైనా పార్టీలో చర్చలు జరుగుతున్నాయి. కల్వకుర్తి నుంచి పోటీ చేస్తారనే మాటలు కూడా గతంలో వినిపించాయి. అక్కడ కాంగ్రెస్ నుంచి గతంలో ఎమ్మెల్యేగా ఉన్న వంశీచంద్ వదులుకోడానికి సిద్ధంగా లేకపోవడంతో ఆలోచనను విరమించుకున్నట్లు తెలిసింది. ఇప్పటికీ కొడంగల్ నుంచి పోటీ చేస్తారన్న వార్తలు కూడా రేవంత్ సన్నిహితుల నుంచి వినిపిస్తున్నాయి. స్వయంగా రేవంత్రెడ్డి ఇప్పటివరకూ ఎక్కడి నుంచి పోటీచేసే విషయాన్ని వెల్లడించలేదు.హుజూరాబాద్ గెలుపుతో ఒకింత ఉత్సాహంగా ఉన్న ఈటల ఈసారి నేరుగా కేసీఆర్పైనే పోటీచేసే రిస్కుకు తలపడుతున్నారు. టీఆర్ఎస్ పట్ల ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతూ ఉన్నదన్న అభిప్రాయమే ఇందుకు కారణంగా భావిస్తున్నారు. రాజకీయాల్లోకి వచ్చింది మొదలు టీఆర్ఎస్లోనే కొనసాగిన ఈటల.. ఆ పార్టీ అధినేత కేసీఆర్ నుంచి జరిగిన అవమానానికి ఈ రూపంలో ప్రతీకారం తీర్చుకోవాలనుకుంటున్నట్లు సన్నిహితుల సమాచారం. రేవంత్రెడ్డి కొడంగల్ నుంచి ఓడిపోవడంతో మల్కాజిగిరి పార్లమెంటు స్థానం నుంచి పోటీచేసి గెలిచారు. నాలుగేళ్ళ గ్యాప్లో కొడంగల్లో చోటుచేసుకున్న పరిస్థితులకు అనుగుణంగా ఎక్కడి నుంచి పోటీచేయాలనేదానిపై నిర్ణయం తీసుకోనున్నారు. పాత ఓటర్ల చైతన్యంలో వచ్చిన మార్పు, దీర్ఘకాలంగా ఓటేసి గెలిపిస్తూ ఉన్నందున కొత్తవారికి అవకాశం ఇవ్వాలని కోరుకునే తత్వం, నియోజకవర్గానికి పెద్దగా చేసిందేమీ లేదనే అసంతృప్తి.. ఇలా అనేక రకాల అభిప్రాయాలు వెలుగులోకి వస్తున్నాయి. పాత స్థానంలో పోటీచేయడంకంటే కొత్త చోటును వెతుక్కోవడమే ఉత్తమం అనే కోణంలో ఈ నిర్ణయం తీసుకుని ఉండొచ్చన్న వాదనలు వినిపిస్తున్నాయి. పాత స్థానాలను విడిచిపెట్టి కొత్త సెగ్మెంట్ల నుంచి పోటీచేసే వీరి పట్ల ఓటర్లు ఎలా స్పందిస్తారనేది వేచి చూడాల్సిందే .

## సంపాదకీయం

# పథకాలు పబ్లిసిటీ కోసమా ప్రజల కోసమా?

**తెలంగాణ ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమం కోసం, చేనేత రంగ అభివృద్ధికి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నాయని పత్రికల్లో ప్రకటనలు చూస్తూనే ఉన్నాం. కానీ వాస్తవంలోకి వస్తే చేనేత కార్మికులకు ఆసరా పింఛన్లు తప్ప మరో పథకం అందడం లేదన్నది ముమ్మాటికీ నిజం.**



అత్యధిక ఓటర్లున్న పద్మశాలీలకు ఇప్పటివరకు ఏ ప్రభుత్వం కూడా సరైన పథకాలు అందించి చేనేత కార్మికులను ఆదుకున్న పాపాన పోలేదు. "చెప్పుకొని మురువు చూసుకొని ఏడువు" నానుడి నేటికీ నిజం. మేధావులు మౌనం పాటిస్తే మూరు?లు రాజ్యమేలుతారు అన్నట్లుగా ప్రతిభావంతులు, తెలివైన పద్మశాలీల మౌనం వల్ల మానవతావాదం లేని వారు రాజ్యమేలుతున్నారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం పాటు పడని నాయకుల వల్ల నేడు నేతన్నలు అత్యంత దయనీయ పరిస్థితి ని ఎదుర్కొంటున్నారు. పద్మశాలి నుంచి ఎంతో మంది నాయకులు ఉన్నప్పటికీ వారి ఎదుగుదల కోసమే తప్ప చేనేత కార్మికుల చేయూత కోసం కాదన్నది ప్రతి ఒక్క చేనేత కార్మికుడికి తెలిసిన విషయం. నాయకులు ఎన్నికల సమయానికి ఓటు బ్యాంకు గా పద్మశాలీలను ఉపయోగించుకుంటున్నారు తప్ప వారికి ఎలాంటి ఉపయోగకరమైన పథకాలు అందించకపోవడం శోచనీయం. పద్మశాలీలు మౌనంగా ఉండబట్టే నేడు చేనేత కార్మికుల శాపంగా మారింది. ఇకనైనా చేనేత కార్మికుల హక్కులను కాపాడాల్సిన అవసరం ఉంది.

**ఫలితాలు ఇవ్వని పథకాలు:**

**1. చేనేత మిత్ర పథకం** ద్వారా 40 శాతం నూలు రాయితీ, నేతన్నకు చేయూత తదితర పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని గత కొన్ని నెలల క్రితం పేపర్లో వచ్చిన విషయం అందరికి తెలిసిందే. పేపర్ లో వచ్చే ప్రతి పథకం చేనేత కార్మికులకు అందుతుందని అనుకోవడం అంతకు మించిన పొరపాటు మరొకటి లేదు. నేతన్న బీమా పథకం ప్రస్తుతం అమలులో ఉందో లేదో కూడా చేనేత కార్మికులకు తెలియదంటే దీనిబట్టి అర్థం చేసుకోవాలి పథకాలు పబ్లిసిటీ కోసమే తప్ప పబ్లిక్ కోసం కాదు అనేది.

**2. ముద్ర పథకం:** పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో చేనేత కార్మికుల అభ్యున్నతికి ముద్ర రుణాలు అందజేస్తున్నారు అందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని అభినందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కానీ మన తెలంగాణ రాష్ట్రంలో మాత్రం ముద్ర లోన్ల ఊసే లేదు. ముద్ర లోన్లు ఉన్నాయన్న విషయం ప్రచారానికే పరిమితం అంతే తప్ప ఏ ఒక్కరు తీసుకున్నట్లు, ముద్ర లోన్స్ అమలులో ఉన్నట్లు కచ్చితమైన సమాచారం అందుబాటులో లేదు. అసలు ముద్రా రుణాలు ఉన్నాయా అనే సందేహం నెలకొంది.

**3. నేతన్న బీమా పథకం:**
మరణించిన చేనేత కార్మికుల కుటుంబం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం "నేతన్న బీమా పథకం". ఏ కారణం చేతనైనా 18–59 సంవత్సరాల వయస్సు గల నేత కార్మికులు మరణిస్తే 10 రోజుల్లోగా నామినీకి ఎల్ఐసి నుండి 5 లక్షల బీమా పరిహారం అందించేలా పథకం రూపొందించబడింది. ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా 2022 ఆగస్టు 8 నుంచి ఈ పథకాన్ని అమలు చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ పథకాన్ని ప్రవేశపెట్టినందుకు తెలంగాణ ప్రభుత్వానికి చేనేత కార్మికులు కృతజ్ఞతలు తెలియజేయాల్సిన అవసరం ఉంది. ఈ పథకాన్ని ప్రెవేశపెట్టినందుకు ఎంతో సంతోషించిన చేనేత కార్మికులకు ఈ పథకం అందని ద్రాక్షలాగే మిగిలింది. అధికారిక ప్రకటన వెలువడినప్పటి నుంచి అనేక మంది చేనేత కార్మికులు మరణించగా, మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు అందజేసినట్లు ఎక్కడ సమాచారం లేదు. బ్రతికుండగా సరైన పథకాలు లేవు మరణించిన తర్వాత కూడా నేతన్న బీమా పథకం లేదు. ఈ పథకాన్ని ప్రారంభించి చేనేత కార్మికులకు నగదు అందజేయడంలో విఫలం కావడంతో చేనేత కార్మికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇతర కులాలకు ఇస్తున్నారు తప్ప చేనేత కార్మికులకు నేతన్న బీమా పథకం అందకపోవడం శోచనీయం.

**4.** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చేనేత కార్మికులకు ఉచితంగా మగ్గాలు అందించిన మాట వాస్తవం. మరి మన రాష్ట్రంలో చేనేత కార్మికులకు ఉచిత మగ్గాలు ఏవి? వాటి స్థానంలో ఇంకేమైనా ఇచ్చారా అది లేదు. అది చేస్తాం ఇది చేస్తాం అనడమే తప్ప ఏమి ప్రయోజనం లేదు.

**5.** బీసీ కులాలందరికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందజేస్తామని ఆశ చూపి చివరి దశలో 15 కులాలకు మాత్రమే వర్తిస్తుంది అని పేపర్ ప్రకటన చేయడం తీవ్ర బాధను కలిగించింది. ఈ పథకం కోసం ప్రతి చేనేత కార్మికుడు 4 రోజులు పని చెడగొట్టుకొని మండలం ఎం ఆర్ ఓ ఆఫీస్, మీ సేవల చుట్టూ తిరిగి అలసిపోయిన చేనేత కార్మికులు ప్రకటన చేయడం వరకే పరిమితమైన పథకాలు మాకొద్దు అంటూ చేతి వృత్తుల అభివృద్ధికి పాటు పడే ప్రభుత్వాన్ని ఈసారి ఎన్నుకుంటామని ముక్తకంఠంతో హెచ్చరిస్తున్నారు..

నేతన్నకు మార్కెటింగ్ సౌకర్యం లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. ముడిసరుకు కొనుగోలు చేసేందుకు ఎక్కువ దూరం వెళ్లాల్సి వస్తోందని, దీంతో రవాణా ఖర్చులు అదనంగా భరించాల్సి వస్తోందని గ్రామాల్లోని నేత కార్మికులు పలుమార్లు ఆవేదన వ్యక్తం చేసినా ఫలితం శూన్యం. ప్రభుత్వాస్పత్రులు, పాఠశాలలో యూనిఫాం దుస్తుల కోసం చేనేత కార్మికులు నేసిన గుడ్డను ప్రభుత్వం కొనుగోలు చేసి చేనేత కార్మికులను ఆదుకోవాలని విన్నవించినా ఫలితం లేకుండా పోయింది.

50 సంవత్సరాలు పైబడిన ప్రతి చేనేత కార్మికులకు ఆసరా పెన్షన్ 2000 రూపాయలు ఇస్తామన్న ప్రభుత్వం అతి కొద్దిమందికి ఇస్తూ మిగతా వారికి ఇవ్వకపోవడం బాధాకరమైన విషయం. తెలంగాణ రాష్ట్రంలో జి ఐ టాగ్ నమోదు కానీ చేనేత కార్మికులు ఎంతో మంది ఉన్నారు. వారికి జి ఐ టాగ్ లేనందున పెన్షన్ పొందలేకపోతున్నారు వారు జి ఐ టాగ్ కోసం ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించక పోవడం విచారకరం.

అత్యధిక ఓటర్లు పద్మశాలీలకు నాయకులు ఎలక్షన్ సమయంలో ఏదో ఒక ఆశ చూపి ఓట్లు వేయించుకునుడు ప్రతి ఎలక్షన్స్ సమయంలో జరిగేదే. నాయకులు ప్రతిసారి పద్మశాలీలను మోసం చేయడం వారి ఓట్ల ద్వారా గెలుపొందడం ఆ తరువాత వారికి ఎలాంటి ప్రయోజనకరమైన పథకాలు ఇవ్వకపోవడం సిగ్గు చేటు. అంతేకాదు పద్మశాలీలు రాజకీయంగా ఎదగకుండా ఎలాంటి పదవి అవకాశాలు కల్పించకుండా అణిచివేతకు గురిచేస్తున్నారు. చేనేత కార్మికులందరూ ఐక్యతగా పోరాడి తమ హక్కులు పరిరక్షించుకోవాల్సిన అవసరం ప్రతి చేనేత కార్మికుడికి ఉంది. ఇకనైనా ప్రభుత్వం చేనేత కార్మికులను ఆదుకొని అండగా నిలవాలి.



వ్యాసకర్త.
జాతీయ చేనేత ఐక్య వేదిక సంఘం
ప్రధాన కార్యదర్శి
కోట దామోదర్
మొబైల్ : 9391480475

## బిగ్‌బాస్ తెలుగు-7

# లోగో విడుదల చేసిన స్టార్ మా

### కొత్త బిగ్ బాస్ తెలుగు సీజన్ ను ప్రదర్శించనున్న స్టార్ మా మరియు డిస్నీ+ హాట్‌స్టార్

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు




ఎంతోకాలం గా మీరు వేచి చూస్తున్న బిగ్ బాస్ తెలుగు 7 యొక్క మిరుమిట్లుగొలిపే నియాన్ లోగో మీ స్క్రీన్ పై ప్రదర్శితమవుతున్న వేళ, వినూత్న అనుభవాలను సొంతం చేసుకోండి. నీలం మరియు ఎరుపు రంగుల సమ్మేళనం ఉత్సాహం మరియు అభిరుచి యొక్క సారాంశాన్ని ప్రతిబింబిస్తూ ఒక ఉత్సాహ పూరిత శక్తిని వెదజల్లుతుంది. దీని సొగసైన డిజైన్ అంతర్జాతీయ టచ్‌ని జోడిస్తుంది, వేరెవ్వరూ అందించలేని విధంగా వినోద అనుభవాన్నీ అందిస్తుంది.ప్రేక్షకులు ఈ షో తో పాటుగా వినోద యుగంలోకి అడుగుపెట్టినప్పుడు వినోద భవిష్యత్తును స్వీకరించండి. 2023లో ఉత్తేజపరిచే మరియు ఆహ్లాదకరమైన నాన్-స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్ అద్భుతంలో భాగం అవ్వండి మరియు బిగ్ బాస్ తెలుగు యొక్క ఉత్కంఠభరితమైన ప్రపంచంలోకి ప్రవేశించండి మరియు అసాధారణమైన అనుభూతిని పొందండి! సూక్ష్మ అంశాలను సైతం కెమెరా లు ఒడిసి పడుతున్న వేళ, ఆకర్షణీయమైన ప్రతి క్షణమూ మీ కళ్ల ముందు సాక్షాత్కరిస్తుంది. ఊహాతీత అంశాలే సాధారణతగా మారే సంతోషకరమైన ప్రయాణాన్ని ప్రారంభించడానికి సిద్ధపడండి.బిగ్ బాస్ తెలుగు 7తో మరపురాని సాహసం కోసం సిద్ధంకండి, త్వరలో స్టార్ మా మరియు డిస్నీ+ హాట్‌స్టార్ లో కూడా అందుబాటులోకి వస్తుంది.బిగ్ బాస్ తెలుగు యొక్క ఉత్కంఠభరితమైన ప్రపంచంలోకి ప్రవేశించండి మరియు అసాధారణమైన అనుభూతిని పొందండి! సూక్ష్మ అంశాలను సైతం కెమెరా లు ఒడిసి పడుతున్న వేళ, ఆకర్షణీయమైన ప్రతి క్షణమూ మీ కళ్ల ముందు సాక్షాత్కరిస్తుంది. ఊహాతీత అంశాలే సాధారణతగా మారే సంతోషకరమైన ప్రయాణాన్ని ప్రారంభించడానికి సిద్ధపడండి.అంతులేని ఉత్సాహం మరియు ఉత్కంఠ ప్రపంచానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైంది!

# ఎలక్ట్రిక్ 3-వీలర్లను అందజేసిన ఇటిఓ మోటార్స్

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు




ఎండ్-టు-ఎండ్ ఎలక్ట్రిక్ మొబిలిటీ ఎకోసిస్టమ్‌ను అందించే భారతదేశంలోని అతిపెద్ద సంస్థల్లో ఒకటైన ఇటిఓ మోటార్స్, తన ఇటిఓ ఎంపవర్స్ ప్రోగ్రామ్ ద్వారా హైదరాబాద్‌లోని చార్మినార్‌కు చెందిన మహిళలు మరియు పురుషుల డ్రైవర్లకు 30 ఎలక్ట్రిక్ 3-వీలర్లను అందించింది. ఈ కార్యక్రమం ద్వారా, డ్రైవర్లకు న్యాయమైన ఉపాధి అవకాశాలను అందించడంతోపాటు ఆరోగ్య మరియు జీవిత బీమా కవరేజీ వంటి అత్యంత బహుమానమైన ప్రోత్సాహకాలు ఒ ప్రయోజనాలను పొందగలరు.వీటిని అసదుద్దీన్ ఒవైసీ, పార్లమెంటు సభ్యుడు, వై.సతీష్ రెడ్డి, చైర్మన్, తెలంగాణ రాష్ట్ర పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ జై భారతి, వ్యవస్థాపకుడు, ఎంఓడబ్లుఓ సురేందర్ నాథ్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, ఇటిఓ మోటార్స్,ఆంథోనీ డేనియల్స్, చీఫ్ బిజినెస్ ఆఫీసర్, ఇటిఓ మోటార్స్; మరియు బాబీ అజ్మీరా, ప్రెసిడెంట్ - మహిళా సాధికారత, ఇటిఓ మోటార్స్ చేతుల మీదుగా అందజేశారు.పార్లమెంటు సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ ఎలక్ట్రిక్ త్రీ-వీలర్లను జెండా ఊపి ప్రారంభించారు. ఉపాధి అవకాశాలను సృష్టించడం మరియు మన మహిళలకు సాధికారత కల్పించడంలో ఇటిఓ మోటార్స్ నిబద్ధతకు నిదర్శనమన్నారు. ఈ ప్రయాణంలో ఇటిఓ మోటార్స్ వారి తిరుగులేని మద్దతు కోసం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసారు. ఇటిఓ మోటార్స్ యొక్క సహకారంతో రాబోయే ఆరు నెలల్లో అదనంగా వంద మంది మహిళలు మరియు పురుషుల డ్రైవర్లకు ఉపాధి అవకాశాలను కల్పించనున్నట్లు తెలిపారు. కాకుండా ఇ‌ఎం యజమానులకు సౌలభ్యం మరియు ప్రాప్యతను మెరుగుపరుస్తాయి.ఈసందర్భంగా టిఎస్ఆర్ఇడిసిఓ చైర్మన్ శ్రీ సతీష్ రెడ్డి మాట్లాడుతూ, "పునరుత్పాదక ఇంధన రంగంలో ఇది చాలా ముఖ్యమైన మైలురాయి. పర్యావరణ ప్రయోజనాలతో పాటు, మేము మహిళలకు ఉపాధి అవకాశాలను కూడా అందించగలుగుతున్నామన్నారు. ఇటిఓ మోటార్స్ హెడ్ మొబిలిటీ సర్వీసెస్ శ్రీ సురేందర్ నాథ్ మాట్లాడుతూ, " ఇటిఓ ఎంపవర్స్ ప్రోగ్రామ్ కింద మా ఎలక్ట్రిక్ 3-వీలర్స్ మరియు సాధికారత కలిగిన మహిళలు మరియు పురుషుల డ్రైవర్‌లను జోడించినందుకు మేము చాలా సంతోషంగా ఉందన్నారు. ఎలక్ట్రిక్ మొబిలిటీ భవిష్యత్తు అని మేము భావిస్తున్నందున ఇది మాకు కీలకమైన ఫోకస్ ప్రాంతం, ఇంకా అనేక మంది మహిళలు మరియు పురుషులు ముందుకు వచ్చి విద్యుత్ విప్లవంలో భాగం కావాలని మేము కోరుకుంటున్నామన్నారు.

# సుప్రీంకోర్టులో జగన్ సర్కార్‌కు మరోసారి భారీ ఎదురుదెబ్బ

న్యూఢిల్లీ- ప్రభాత సూర్యుడు



సుప్రీంకోర్టులో జగన్ సర్కార్‌కు మరోసారి భారీ ఎదురుదెబ్బ తగిలింది. అమరావతిపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. అత్యవసరంగా విచారణ చేపట్టాలన్న రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థనలను సైతం సుప్రీం ధర్మాసనం తోసిపుచ్చింది. అమరావతి రాజధానిపై దాఖలైన పిటిషన్ల విచారణ ఈ ఏడాది డిసెంబర్‌కు వాయిదా వేసింది. ఆ లోపు ఈ కేసు విచారణ సాధ్యం కాదని సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది.ప్రతివాదుల్లో ఇద్దరు చనిపోయారని అమరావతి రైతుల తరపు న్యాయవాదులు వెల్లడించారు. చనిపోయినవారిని జాబితా నుంచి తొలగించాలని ఏపీ ప్రభుత్వం కోరింది. చనిపోయినవారిని జాబితా నుంచి తొలగించినట్టయితే మిగిలిన అందరికీ నోటీసులు అందినట్టేనని వెల్లడించింది. ఇంకా మరికొందరికి నోటీసులు అందలేదని అమరావతి రైతుల తరపు న్యాయవాదులు చెప్పారు. నోటీసులు అందని ప్రతివాదులందరికీ నోటీసులు పంపాలని ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ అప్పీల్‌ను లీడ్ మ్యాటర్‌గా పరిగణిస్తూ తదుపరి విచారణను ఈ ఏడాది డిసెంబర్‌కు వాయిదా వేసింది.

# ఆ ముగ్గురు పార్టీ మారుతున్నారా...

(మొదటిపేజీ తరువాయి)
నేతలంతా ఒక్కటవుతారని భావించినా కొంత మంది ఇంకా అసంతృప్తితోనే ఉన్నట్లు తెలుస్తున్నది. తాజాగా ప్రధాని మోడీ వరంగల్ టూర్‌కు రాష్ట్ర స్థాయి ముఖ్య నేతలు ముగ్గురు డుమ్మా కొట్టడం కొత్త చర్చకు దారి తీసింది. విజయశాంతి, వివేక్ వెంకటస్వామి, మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్ దూరంగా ఉన్నారు.ఈ వ్యవహారం ఇప్పుడు కమలం పార్టీలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ ముగ్గురు నేతలు పార్టీలో కొంత కాలంగా చోటు చేసుకుంటున్న పరిణామాలపై అసంతృప్తితో ఉన్నట్లు చర్చ జరుగుతున్నది. పార్టీలో తనకు గుర్తింపుతో పాటు అధ్యక్ష పదవి నుంచి బండి సంజయ్‌ను తప్పించడాన్ని విజయశాంతి బహిరంగంగానే తప్పుపట్టగా, పార్టీలో అందరి కంటే ముందు చేరిన తనను కాదని ఈటలకు ప్రయార్టీ ఇవ్వడంపై వివేక్ గుర్రుగా ఉన్నట్లు ప్రచారం జరుగుతున్నది.ఈ క్రమంలో ఆయన పార్టీ మారుతున్నారని వార్తలు గుప్పుమంటున్నాయి. కొన్ని రోజులుగా బీజేపీ నాయకత్వ వ్యవహార శైలిపై అసంతృప్తితో ఉన్న మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్ సైతం కండువా మార్చబోతున్నారనే జోరుగా ప్రచారం జరుగుతున్నది. పార్టీలో చేరే సమయంలో సముచిత స్థానం కల్పిస్తామని ముఖ్య నేతలు హామీ ఇచ్చినప్పటికీ పార్టీలో ప్రాధాన్యత దక్కడం లేదని దీంతో పార్టీ మారడమే ఉత్తమమనే అభిప్రాయానికి వచ్చారనే చర్చ జరుగుతున్నది.ఈ నేపథ్యంలో వీరంతా మోడీ పర్యటనకు గైర్హాజరయ్యారు. ఇలాంటి పరిస్థితుల్లో బీజేపీ శ్రేణులంతా అత్యంత కీలకం అని భావించే మోడీ సభకు విజయశాంతి, వివేక్, చంద్రశేఖర్ దూరంగా ఉండటం కొత్త సందేహాలకు తావిస్తోంది. ప్రచారం జరుగుతున్నట్లుగానే వీరి కండువాలు మార్చబోతున్నారా లేక పార్టీలో ఉంటూనే వ్యూహాత్మకంగా మోడీ సభకు దూరంగా ఉన్నారా అనేది తెలియాల్సి ఉంది.

## బాలుణ్ణి దత్తత తీసుకొన్న విదేశీయులు



ఖమ్మం- ప్రభాత సూర్యుడు

పిల్లలు లేని దంపతులకు దత్తత ఒక వరమని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. ఐడిఓసి లోని కలెక్టర్ ఛాంబర్ లో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ద్వారా ఖమ్మం జిల్లా బాలల సంరక్షణాలయం కు చెందిన బాబును కారా నిబంధనల మేరకు చట్ట ప్రకారం ఇటలీ కి చెందిన దంపతులకు దత్తత ఇచ్చారు. జిల్లాలో గల 18 సంవత్సరాల లోపు బాలబాలికలు (అనాధ, వదిలివేయబడిన, స్థోమత లేని తల్లిదండ్రులు) చట్టప్రకారం దత్తత ప్రక్రియలోకి తీసుకువచ్చి, జిల్లా కలెక్టర్ ద్వారా కారా నిబంధనల మేరకు దత్తత ఇవ్వడం జరుగుతుందన్నారు. పిల్లలు లేని దంపతులు లిలిలి.ఇజీతీజీ.నితిఇ.తిని వెబ్ సైట్ ద్వారా 18 సంవత్సరాల లోపు పిల్లలను దత్తత తీసుకోవచ్చని, దత్తత ప్రక్రియ గురించి అంగన్వాడీ టీచర్, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, శిశుగృహను సంప్రదించాలని, దత్తత ద్వారా ఇట్టి అవకాశాన్ని పిల్లలు లేని దంపతులు వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, డిసిపిఓ విష్ణు వందన, ప్రొటెక్షన్ అధికారిణి సోని తదితరులు పాల్గొన్నారు.

### లండన్ గడ్డపై రాకింగ్ రాకేశ్ -

## జోర్దార్ సుజాత బోనాల జాతర

వరంగల్ - ప్రభాత సూర్యుడు

వరంగల్‌కు చెందిన ఎన్ఆర్ఐ ఫొరమ్ లండన్‌లో బోనాల జాతర వేడుకలు ఘనంగా నిర్వహించారు. గత పదేళ్లుగా ఈ ఉత్సవం నిర్వహిస్తునప్పటికీ ఈ ఏడాది మరింతగా ఘనంగా నిర్వహించాలని ఎన్ఆర్ఐ ఫోరమ్ నిర్ణయించుకుంది. యాంకర, నటి తెలంగాణ మహిళ అయిన జోర్దార్ సుజాత ఆధ్వర్యంలో బోనాల జాతర నిర్వహించారు. ఈ మేరకు ఫోరమ్ ప్రెసిడెంట్ శ్రీధర్ నీల మాట్లాడుతూ "తెలంగాణ సంస్కృతిలో భాగమైన బోనాల ఉత్సవాలు ఎన్నో ఏళ్లగా లండన్‌లో నిర్వహిస్తున్నాం. ఈ ఏడాది ఎప్పటిలా కాకుండా మరింత ఘనంగా చేస్తున్నాం. ఈ వేడుకలో మరింత ఉత్సాహాన్ని నింపడానికి హైదరాబాద్ నుంచి రాకింగ్ రాకేశ్, సుజాత ఇక్కడికి రావడం ఆనందించదగ్గ విషయం" అని తెలిపారు.

నేరెళ్ల వేణుమాధవ్ శిష్యుల తర్వాత రాకింగ్ రాజేశ్ మిమిక్రీ అంతగా పాపురల్ అయ్యారు. బజర్దస్త్ వంటి షోలతో చక్కని గుర్తింపు తెచ్చుకున్నారు. సినిమాల్లోనూ అవకాశాలు అందుకుంటున్నారు. ఇటీవల అమెరికా, న్యూజెర్సీలోని నాట్స్ కార్యక్రమం విజయవంతం తర్వాత రాకింగ్ రాకేశ్, జోర్దార్ సుజాత లండన్‌లో జరిగిన బోనాల ఉత్సవంలో తమదైన శైలి స్కిట్లు, మిమిక్రీ కార్యక్రమాలతో అలరించారు. ఈ షోతో ఆయన 2300 షోల మార్కును దాటారు.

ఈ మేరకు రాకింగ్ రాకేశ్ మాట్లాడుతూ "వరంగల్ ఎన్ఆర్ఐ ఫోరమ్‌తో నాకు మంచి అనుబంధం ఉంది. కరోనా సమయంలోనే కాకుండా మామూలు సమయంలో కూడా ఇబ్బందుల్లో ఉన్న ఎంతోమందికి నా ద్వారా డబ్బు పంపి సహకారం అందించారు. చిన్నారుల, చదువు ఆర్యోగాలకు సహకరించారు. ఈసారి బోనాల వేడుకలో మేం భాగం కావాలని వరంగల్ ఎన్ఆర్ఐ ఫోరమ్ కోరంగా.. గతంలో వారు చేసినా సేవలకు కృతజ్ఞతా భావంతో లండన్ షో చేశాం. మమ్మల్ని ఇందులో భాగం కావాలని ప్రత్యేకంగా ఆహ్వానించడం ఎంతో ఆనందంగా ఉంది. ప్రస్తుతం లండన్‌లో చేసిన షోతో 2300 షోలను పూర్తి చేశాను. నాకు ఈ అవకాశం ఇచ్చిన ఫోరమ్ ప్రెసిడెంట్ శ్రీధర్ నీల, ఫౌండర్ కిరణ్ పసునూరి, జనరల్ సెక్రటరీ రమణ, వైస్ ప్రెసిడెంట్ నాగ ప్రశాంతి, ప్రవీణ్ బిట్ల, కమల తదితరులకు కృతజ్ఞతలు" అని అన్నారు.



### కమిషన్లకు కక్కుర్తి పడి

# వ్యవసాయానికి 24 గంటల కరెంట్ అనే స్లోగన్

- మూడెకరాల్లో వ్యవసాయం చేసే రైతుకు మూడు గంటల పాటు విద్యుత్ చాలు
- ఉచిత కరెంట్ పేరుతో కేసీఆర్ ప్రజలను మభ్య పెడుతుండు: రేవంత్ రెడ్డి
- జగదీష్ రెడ్డి పవర్ లేని మినిష్టర్.. ఆయన గురించి తాను మాట్లాడను
- 24 గంటలు కరెంట్ ఇస్తున్నారని నిరూపిస్తే రాజీనామా చేస్తా: కోమటిరెడ్డి



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి రైతులకు ఉచిత విద్యుత్ గురించి తానా సభలో మాట్లాడిన మాటలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి. "తెలంగాణలో 95 శాతం రైతులు మూడెకరాల లోపు ఉన్న చిన్న, సన్నకారు రైతులు. ఒక ఎకరాకు నీళ్లు పారించాలంటే ఒక గంట చాలు. మూడెకరాల్లో వ్యవసాయం చేసే రైతుకు మూడు గంటల పాటు విద్యుత్ అందుబాటులో ఉంటే చాలు. టోటల్‌గా 8 గంటలు ఉచిత విద్యుత్ ఇస్తే సరిపోతది. కేవలం విద్యుత్ సంస్థల దగ్గర కమిషన్లకు కక్కుర్తి పడి వ్యవసాయానికి 24 గంటల కరెంట్ అనే స్లోగన్ తీసుకొచ్చిండు. ఉచిత కరెంట్ పేరుతో కేసీఆర్ ప్రజలను మభ్య పెడుతుండు. ఇట్లాంటి ఉచితం అనేది అనుచితంగా వ్యవహరించొద్దు. దాన్ని మన స్వార్థానికి వాడుకోవద్దని చెప్పేసి ఉచిత కరెంట్ విషయంలో స్పష్టంగా చెబుతున్నం" అని రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారాయి.అధికార బీఆర్ఎస్ రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ట్విటర్‌లో ఎదురుదాడికి దిగింది. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై మండిపడిన భారత రాష్ట్ర సమితి తెలంగాణ వ్యాప్తంగా ఈరోజు, రేపు నిరసనలకు పిలుపునిచ్చింది. మరోసారి తన రైతు వ్యతిరేక విధానాలను కాంగ్రెస్ పార్టీ బయటపెట్టుకుందని, ఉచిత విద్యుత్ కార్యక్రమాన్ని రద్దు చేయాలన్న దుర్మార్గపు ఆలోచన కాంగ్రెస్ పార్టీదని బీఆర్ఎస్ ట్విటర్ వేదికగా మంత్రి కేటీఆర్ దుయ్యబట్టారు. ఇదిలా ఉండగా.. బీఆర్ఎస్ నుంచే కాకుండా సొంత పార్టీ నేతల నుంచి కూడా రేవంత్ వ్యాఖ్యలపై అభ్యంతరాలు వ్యక్తమవడం గమనార్హం. రేవంత్ ఎప్పుడూ కంట్రోల్ తప్పదని, అలా ఎందుకు అనాల్సి వచ్చిందో అడుగుతానని కాంగ్రెస్ సీనియర్ నేత కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పందించారు. తన వ్యాఖ్యలపై రేవంత్ క్లారిటీ ఇస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. బీఆర్ఎస్ ఓడిపోతుందని తెలిసి రేవంత్ వ్యాఖ్యలను అడ్వాంటేజ్ తీసుకొంటోందని, తెలంగాణ ప్రభుత్వం 24 గంటలు కరెంట్ ఇస్తున్నారని నిరూపిస్తే తాను రాజీనామా చేస్తానని కోమటిరెడ్డి సవాల్ విసిరారు. కేటీఆర్ తనతో వస్తే తెలంగాణలో కరెంట్ పరిస్థితి ఎలా ఉందో చూపిస్తానని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ కరెంట్ పాలసీ ఏ విధంగా ఉంటుందో అందరం చర్చించి, తమ మేనిఫెస్టోలో చెప్తామని కోమటిరెడ్డి తెలిపారు. పదిగంటలు కరెంట్ వస్తే అందులో పది సార్లు కరెంట్ పోతుందని ఎద్దేవా చేశారు. జగదీష్ రెడ్డి పవర్ లేని మినిష్టర్ అని, ఆయన గురించి తాను మాట్లాడనని కోమటిరెడ్డి చెప్పారు.

# తెలంగాణలో రెండో నగరంగా కరీంనగర్

### మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్ - ప్రభాత సూర్యుడు



కరీంనగర్ అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తుందని బీసీ సంక్షేమ పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్ లోని 18వ డివిజన్ లోని రేకుర్తి వెంకటేశ్వర కాలనీలో మంగళవారం రూ. 1.90 కోట్ల పలు అభివృద్ధి పనులకు నగర మేయర్ యాదగిరి సునీల్ రావుతో కలిసి మంత్రి భూమి పూజ చేశారు. డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించిన మంత్రికి డివిజన్ వాసులు శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా మంత్రి గంగుల మాట్లాడుతూ.. తెలంగాణలో కరీంనగర్ ను రాష్ట్రంలో రెండో నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. నగర పాలక సంస్థలో విలీనమైన డివిజన్ల అభివృద్ధికి కృషి చేస్తుందని వెల్లడించారు. రేకుర్తి గ్రామ పంచాయితీగా ఉన్నప్పుడు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. రేకుర్తి 18, 19 డివిజన్ల అభివృద్ధికి అత్యధికంగా నిధులు కేటాయించామని తెలిపారు. పనులు పురోగతిలో ఉన్నాయని వెల్లడించారు. ప్రారంభించిన పనులన్నీ నెల రోజుల్లో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కరీంనగర్ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సుధగుని మాధవి కృష్ణ గౌడ్, ఏదుల్ల రాజశేఖర్ కార్పొరేటర్లు, వి.రాజేందర్ రావు, భూమాగౌడ్, జంగిలి సాగర్, దీండిగాల మహేష్, గుగ్గిళ్ల శ్రీనివాస్, తుల బాలయ్య, బీఆర్ఎస నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీద్, నరేష్ డివిజన్ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

## హిందువుల మనోభావాలు దెబ్బతింటే ఊరుకునేది లేదు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



హిందువుల మనోభావాలు దెబ్బతింటే.. సీఎం జగన్ కాలర్ పట్టుకుని నిలదీస్తామని తెలంగాణ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. తిరుపతి తిరుమల ఆంధ్రులది మాత్రమే కాదని.. యావత్తు భారతీయులదని జగన్ గుర్తుంచుకోవాలని హితవు పలికారు. తిరుమలలో పురాతన మండపాన్ని కూల్చటమంటే హిందువుల మనోభావాలను దెబ్బతీయటమేనన్నారు. శ్రీకృష్ణదేవరాయలు నిర్మించిన మండపాన్ని కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అడిగే వారు లేరన్నట్లు ఏపీ సీఎం జగన్ వ్యవహరిస్తున్నారన్నారు. పురాతన మండపానికి మరమ్మత్తులు చేయకుండా.. కూల్చటం తప్పని రాజాసింగ్ అన్నారు.

### రేపటి బందును విజయవంతం చేయాలనీ

## పిలుపు నిచ్చిన విద్యార్థి సంఘాలు



మహబూబాబాద్ - ప్రభాత సూర్యుడు

రేపటి పాఠశాలలు, ఇంటర్మీడియట్ కళాశాలల బందును జయప్రదం చేయాలని ఐక్య విద్యార్థి సంఘాలు పిలుపునివ్వడం జరిగింది. రేపటి బందును జయప్రదం కై నిర్వహించిన సన్నాహక సమావేశంలోపి డి ఎస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షులు నేతకాని రాకేష్, ఏ ఐ ఎస్ ఎఫ్ రాష్ట్ర నాయకులు బందు మహేందర్, ఎస్ ఎఫ్ ఐ జిల్లా పి. మధు లు మాట్లాడుతూ కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో విద్యారంగం పూర్తిగా విస్మరించబడుతుందని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగంపై సవతి తల్లి ప్రేమను చూపిస్తుందని వారు విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలలో ఇప్పటివరకు కూడా పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు విద్యార్థులకు పూర్తిస్థాయిలో పంపిణీ చేయకపోవడం శోచనీయమని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో విద్యారంగానికి కేటాయించిన బడ్జెట్ కంటే తెలంగాణ ఏర్పడిన తర్వాత బడ్జెట్ కేటాయింపులో చాలా నిర్లక్ష్యంచేస్తుందని వారు విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలలో, కాలేజీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక, అధ్యాపకేతర పోస్టులు భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇటువంటి సమస్యలను పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్తంగా జరగబోవు రేపటి బందును విజయవంతం చేయాలని విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, ప్రభుత్వ మరియు ప్రైవేటు కళాశాల యాజమాన్యాలకు విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి అమీర్, నాయకులు అజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పీఎస్లో హిజ్రాల రణరంగం



నల్గోండ- ప్రభాత సూర్యుడు : మిర్యాలగూడ వన్ పోలీస్ స్టేషన్ రణరంగంగా మారింది. రౌడీలు కాదు. ఫాక్షనిస్టులు కాదు. హిజ్రాలు పోలీస్ స్టేషన్లోనే రెచ్చిపోయారు. రెండు గ్రూప్లుగా విడిపోయి తీవ్రంగా కొట్టుకున్నారు. రాళ్లు రువ్వుకున్నారు.

## బీజేపీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ జన్మదిన వేడుకలు

కోరుట్ల- ప్రభాత సూర్యుడు

పట్టణంలోని31వ వార్డు బీజేపీ కౌన్సిలర్ పెండెం గణేష్ ఆధ్వర్యంలోబీజేపీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు,జాతీయ కార్యవర్గ సభ్యులు కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్ కుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు..అనంతరం మున్సిపల్ కౌన్సిలర్ గణేష్ మాట్లాడుతూబండి సంజయ్ హిందుత్వ సిద్దంతాల కోసం నిరంతరం పోరాడే సైనికుడని, తెలంగాణలో బీజేపీ పార్టీ కి అధికారంలోకి తీసుకు రావాడానికి పాదయాత్రకి కదంతొక్కిన నాయకుడని,పల్లె ప్రజలలోకి బీజేపీ పార్టీని విస్తరించిన నాయకుడని కొనియాడారు. ఓ సామాన్య కార్పొరేట్ స్థానం నుండిపార్లమెంట్ సభ్యుడిల, రాష్ట్ర అధ్యక్షుడిగా, జాతీయ కార్యవర్గ సభ్యునిగా బండి సంజయ్ ఎదిగారని ఆయననుస్ఫూర్తిగా తీసుకొని ప్రతి కార్యకర్త రాష్ట్రంలో బీజేపీ పార్టీని అధికారంలోకి వచ్చే వరకు ఆహోర్నిశలు పని చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మాసం ప్రసాద్ ,గుజ్జుల అజయ్ ,జక్కుల ప్రవీణ్ ,గుండేటి సంజీవ్ ,రుద్ర ప్రశాంత్ ,మామిడిపెల్లి విజయ్ ,గుండేటి సాయికుమార్ ,వాసాల నవీన్,మిట్టపెల్లి రవి ,వెగ్యరపు అభిషేక్ ,చెన్న విశ్వేష్ ,ఉదయ్ ,గోనె సాయి చందు , బన్నీ ,గుడ్ల ధీరజ్ ,సంజయ్ ,అక్షయ్ ,ఉదుత హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215